క్లుప్తంగా

శివాలయ భూముల కౌలుకు నేడు వేలం

అడవిదేవులపల్లి : స్థానిక శ్రీచెన్నకేశవరస్వామి ఆలయ భూములు కౌలు సంవత్సరానికి గాను ఈనెల 19న వేలం పాట నిర్వహించనున్నట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జ్ మేనేజర్ మృత్యుంజయ శాస్త్రీ తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణలో మాట్లాడుతూ సర్వే నంబర్418లో 3.20 ఎకరాలు, 419లో 6.26 ఎకరాలు, 420లో 7.12ఎకరాలు, 421లో 2.23 ఎకరాలు, 422లో 6.22 ఎకరాలు, 423లో 4.32 ఎకరాలు, 427లో 10.21ఎకరాలు, 486లో 1.00 ఎకరం, 39లో 5.05ఎకరాల విస్తీర్ణం భూములు కౌలుకు వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలం పాటలో పాల్గొనే వారు ముందుగా రూ.5వేలు డిపాజిట్‌గా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వేలంలో దేవాయాలనికి బకాయిలు ఉన్నవారు కానీ, దేవాలయ ఉద్యోగులు కానీ పాల్గొనరాదని తెలిపారు. ఈ అవకాశాన్ని కౌలు దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

త్రిపురారం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షుతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలతో పాటు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరు కావాలని కోరారు. ఎలాంటి అనుమతులు లేకుండా సర్వసభ్య సమావేశానికి అధికారులు గైర్హాజరు అయితే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి

దేవరకొండ : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదల చేయాలని టీఎస్ఎస్ఎఫ్ దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జర్పుల జగన్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా విద్యార్థుల ఉపకార వేతనాలు విడుదల చేయకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ నిధులు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వంశీ, సాయి, వినయ్, రమేష్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ భువనగిరి శ్రీను అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. ఎంపీపీ గౌరవ సలహదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డిలు వేర్వేరుగా శ్రీను మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఇరువురు రూ.5వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, త్రిపురారం పట్టణ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హాలియా : అనుముల మండలంలోని పాలెం గ్రామ శివారులో హాలియా వాగు నుంచి మంగళవారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సతీష్‌రెడ్డి తెలిపారు. అనుముల మండలంలోని పాలెం గ్రామానికి చెందిన గడ్డమీది మహేష్ హాలియా వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా తనపై కేసు నమోదు చేసి ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

దేవరకొండ : పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ మంగళవారం దేవరకొండ ఎంపీడీఓ కార్యాయం ఎదుట చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ కార్మికుల బకాయిలు చెల్లించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, అంజయ్య, లక్ష్మి, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో అర్ధశతాబ్ది ఉత్సావాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్వామివారికి 108 కలషాలు, 108 సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. సాయంత్రం దీపాలంకరణ నిర్వహించారు. నందికొండ మున్సిపాలిటీతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పచ్చ రంగులో 'భగీరథ' నీరు

- అలెర్జీ వస్తుందని త్రిపురారం మండల ప్రజల గగ్గోలు
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని అధికారులు



పెద్దదేవులపల్లిలో పచ్చ రంగులో ఉన్న మిషన్ భగీరథ నీరు

త్రిపురారం : మండలంలో మిషన్ భగీరథ నీరు పచ్చ రంగులో సరఫరా అవుతున్నాయని, ఆ నీరు వినియోగించడంతో అలర్జీ వస్తుందని మండల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. పలుమార్లు మండల ప్రజా ప్రతినిధులు, భగీరథ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించడానికి పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్ద చెరువుకు సమీపంలో 9 ఎంఎల్‌డీ నీటి శుద్ధి ప్లాంట్‌న్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఆయా గ్రామాల్లోని ఎత్తు ట్యాంక్‌లకు విడుదల చేసి ఆ ట్యాంక్‌ల ద్వారా ప్రతి ఇంటికీ నల్లాల ద్వారా మంచి నీరు అందిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటటంతో మండలానికి మిషన్ భగీరథ నీరే దిక్కుగా మారింది. కానీ భగీరథ అధికారులు, గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు మంచి నీటి సరఫరాను పటికంచుకోకపోవడంతో కలుషిత నీటిని ప్రజలు వినియోగించాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. మంచి నీటి ట్యాంక్‌లను శుభ్రం చేయడంలో కూడా నిర్లక్ష్యంగా ఉంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదు చేయడానికి మండలంలో మిషన్ భగీరథ అధికారులు కూడా అందుబాటులో ఉండడంలేదని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పెద్దదేవులపల్లి వాటర్ ప్లాంట్‌లో గ్యాస్, ఆలం కొరత

పెద్దదేవులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో 2000 ఎకరాల విస్తీర్ణంలో చిన్న, పెద్ద చెరువులు రెండు ఉన్నాయి. దీంతో మండలంలోని గ్రామాలకు మంచి నీటిని సరఫరా చేయడానికి మిషన్ భగీరథ పథకంలో భాగంగా 9- ఎమ్ఎల్‌డీ వాటర్ శుద్ధి ప్లాంట్‌ను చెరువు సమీపంలో ఏర్పాటు చేశారు. అయితే ప్లాంట్‌లో వాటర్‌ను శుద్ధి చేయడానికి వినియోగించే గ్యాస్, ఆలం కొద్ది రోజులుగా భగీరథ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొరత ఏర్పడింది. దీంతో వాటర్‌ను శుద్ధి చేయకుండానే ప్లాంట్ నుంచి గ్రామాలకు సరఫరా చేస్తున్నారని తెలుస్తుంది. దీంతో మిషన్ భగీరథ నీరు గ్రామాలకు పచ్చ రంగులో సరఫరా అవుతున్నాయి. పలు గ్రామాల్లో గ్రౌండ్ వాటర్ పూర్తిగా వాడుకోవడానికి వీలు లేకపోవడంతో భగీరథ నీటిని వినియోగిస్తుండడంతో అలర్జీ వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

పచ్చ రంగు నీటితో ఇబ్బందులు పడుతున్నాం



మా ఊళ్లో బావులు, బోర్ల నీళ్లు వాడుకోవడానికి పనికిరావు. నల్లాల ద్వారా వచ్చే నీటినే ఇంట్లోకి, పశువులకు వాడుకోవాలి. వారం రోజుల నుంచి భగీరథ నీళ్లు పచ్చగా వస్తున్నాయి. దీంతో అలర్జీ కూడా వస్తుంది. ఏ నీళ్లు లేకపోవడంతో పచ్చగా వచ్చిన నీటిని ఉపయోగిస్తున్నాం. మంచి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

– సింగం జయమ్మ, గృహిణి, పెద్దదేవులపల్లి

ట్యాంక్‌లను శుభ్రంగా ఉంచుతున్నాం



జిల్లా అధికారుల ఆదేశాను సారం గ్రామాల్లో ప్రతి రోజు వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేస్తున్నాం. సకాలంలో బ్లీచింగ్ పౌడర్ కూడా వినియోగిస్తున్నాం. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు మంచినీటి సరఫరాపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భగీరథ నీటి సరఫరాలో కార్యదర్శులు నిర్లక్ష్యంగా ఉంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

–కొడిరెక్క రాజేంద్ర కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీఓ

మంచినీరు అందే విధంగా చర్యలు తీసుకుంటాం

ప్లాంట్‌లోకి పెద్దదేవులపల్లి చెరువు నీటిని తీసుకొని శుద్ధి చేసి గ్రామాలకు పంపిణీ చేస్తున్నాం. చెరువు నీరు కొద్ది నెలలుగా నిల్వ ఉండడంతో సమస్య తలెత్తుతుంది. ఆ చెరువు నీటిని పరిశీలించి అవసరమైన విధంగా శుద్ధి చేసి సరఫరా చేస్తాం. మంచి నీరు అందేవిధంగా చర్యలు చేపట్టాం.

– ప్రవీణ్, భగీరథ ఏఈ, త్రిపురారం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



పార్కు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని 1, 13, 15, 16వ వార్డుల్లో ఆయన పర్యటించారు. పాత బజార్‌లో ప్రభుత్వ కార్యాలయ నిర్మాణం కోసం ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీలించారు. పట్టణంలోని ఖిల్లా ఆవరణలో కొనసాగుతున్న పార్కు పనులను సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులకు ఆయన సూచించారు. ఖిల్లా బావిని పునరుద్ధరించేందుకు అవసరమైన నివేదికలు తయారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దేవరకొండ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ౘైర్మన్ నర్సింహ, వైస్ ౘైర్మన్ రహత్‌అలీ, సైదులు, వెంకటేశ్వర్లు, జయప్రకాష్, ఇలియాస్, మున్సిపల్ అధి కారులు

ప్రతి ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యం

దేవరకొండ : నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణ, ఆర్అండ్ఆర్ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. అదే విధంగా డిండి కాలువల ఆధునీకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. త్వరలోనే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను ప్రభుత్వం తిరిగి ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్‌శాఖ అధికారులు ఉన్నారు.

సమ్మెకాలం వేతనాలు చెల్లించాలి



మిర్యాలగూడ టౌన్ : సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్



దేవరకొండ : సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ టీచర్లకు సమ్మెకాలం వేతనాలను చెల్లించాలని కోరుతూ మంగళవారం మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమతకు సోమవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నాయకులు బంటు వెంకటేశ్వర్లు, యూని యర్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బైరెడ్డి రాణిలు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అంగన్‌వాడీ టీచర్లకు రూ.10లక్షలు, ఆయాలకు రూ.5లక్షల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురకాలు వనజ, ప్రాజెక్టు కోశాధికారి భవాని, సభ్యురాలు సక్కు, సునిత తదితరులున్నారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

దేవరకొండ : అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు శాంతాబాయి కోరారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దేవరకొండ సీడీపీఓ కారార్యలయంలో విపతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మణెమ్మ, భాగ్య, స్వప్న, భాగ్యలక్ష్మి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

- మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



బీసీ హాస్టల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి : విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఉపాధ్యాయులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌తో పాటు బీసీ సంక్షేమ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్యతోపాటు, ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్య, నోట్ బుక్స్, అందజేత, మౌలిక సదుపాయాల కల్పనను తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. బీసీ హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది ద్వారా రికార్డులను పరిశీలించారు. హాస్టల్ కిచెన్ రూమ్ ఓపెన్ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిలో నైపుణ్య సామర్థ్యలను పెంచాలన్నారు. పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీనాయక్, ఎంపీపీ సునీతకృపయ్య, ప్రత్యేకాధికారి వసంతకుమారి, హెచ్ఎం రమేష్, నాయకులు ఎల్లారెడ్డి, కాంతారెడ్డి, పాండు, అయ్యపురెడ్డి, సుధాకర్, సైదిరెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతులు కల్పించాలి

మాడుగులపల్లి : కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో అన్ని వసతులు కల్పించాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సూచించారు. మండలంలోని కుక్కడం గ్రామంలో నిర్వహిస్తున్న వేములపల్లి మండలానికి చెందిన కేజీబీవీని మంగళవారం ఆయన పరిశీలించారు. సర్కారీ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థినులకు ఇబ్బంది లేకుండా మాడుగులపల్లి మండల పరిధిలోనే పాఠశాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేజీబీవీని ఇతర ప్రదేశానికి తరలించేది లేదని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వేములపల్లి ఎంపీపీ పుట్టల సునీతకృపయ్య, ఎంఈఓ బాలాజీనాయక్, కేజీబీవీ ప్రత్యేకాధికారి వసంత, ఉపాధ్యాయినులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్ గెజిటెడ్ హెచ్ఎం ప్రకాశ్ అన్నారు. మంగళవారం చల్మారెడ్డి గూడెం పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు అందజేసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులతో పాటు ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆకురాతి అమృతయ్య, పల్‌రెడ్డి నిర్మల, మందా సైదులురావు గౌతమ్, తుమ్మకొమ్మ రామకృష్ణ, వడ్త్యా సునిత, గారపాటి శ్యామలాదేవి పాల్గొన్నారు.



చల్మారెడ్డిగూడెంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న హెచ్ఎం

ఫిట్నెస్ లేని పాఠశాలల బస్సులు సీజ్ చేయాలి



ఎంవీఐ వీరస్వామికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మిర్యాలగూడ : ఫిట్నెస్ లేకుండా నడుపుతున్న ప్రైవేట్ పాఠశాలల బస్సులను సీజ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం, మాలమహానాడు విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఎంవీఐ వీరస్వామికి వారు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఫిట్నెస్ లేకుండా నిర్లక్ష్యంగా బస్సులను నడిపి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు. పాత బస్సులను కొనుగోలు చేసి వాటికి రంగులు వేసి ఫిట్నెస్ ఉన్నట్లు చూపి విద్యార్థులను బస్సుల్లో ఎక్కించుకొని నడుపుతున్నారని ఆరోపించారు. ఎంవీఐ స్పందించి ప్రైవేట్ పాఠశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఫిట్నెస్ లేని బస్సులను గుర్తించి సీజ్ చేయడంతోపాటు పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్, మాలమహానాడు విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రవి, నాయకులు బట్టు శ్రీకాంత్, మహమ్మద్ గౌస్, నాగరాజు, సురేష్, గోపి, శ్రీను పాల్గొన్నారు.

పదోన్నతుల్లో గిరిజన ఉపాధ్యాయులకు అన్యాయం



బంగారుగడ్డ ప్రాథమిక పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన ఉపాధ్యాయులు

మిర్యాలగూడ : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పదోన్నతుల్లో గిరిజన ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతుందని టీజీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర కృష్ణకాంత్‌నాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆయన గిరిజన ఉపాధ్యాయులతో కలిసి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయుల జాయినింగ్ నుంచి సీనియార్టీ లెక్కించి పదోన్నతులు కల్పించాలని, అన్‌ట్రెయిన్డ్ టీచర్లకు డేట్ ఆఫ్ జాయినింగ్‌ను క్రైటీరియాగా తీసుకోని తదితపరి పదోన్నతి సర్వీస్‌ను లెక్కించాలన్నారు. ఈ కార్యక్రమంలో హరినాయక్, గిరి, అరుణ, రాంసింగ్, రాంజీనాయక్, శంకర్‌నాయక్, బద్దునాయక్, వేదశ్రీ పాల్గొన్నారు.

చెరువును పరిరక్షించాలని వినతి



ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కొండ్రపోల్ గ్రామస్తులు

మిర్యాలగూడ : కబ్జాకు గురైన చెరువును కాపాడాలని కోరుతూ దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామస్తులు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ కొండ్రపోల్ గ్రామంలో 176.30 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం ఉండగా చెరువు కింద వెయ్యి ఎకరాల్లో రైతులు పంటను సాగు చేసుకుంటారని తెలిపారు. మత్స్యకారులు చేపలు పట్టుకుంటూ జీవనం సాగిస్తాన్నట్లు తెలిపారు. కాని కబ్జాదారులు 50 ఎకరాల మేరా చెరువు భూమిని కబ్జా చేసినట్లు తెలిపారు. దీంతో చెరువులో నీటి నిల్వ లేక రైతులు సాగు చేసుకుంటున్న వరిపొలాలు ఎండిపోతున్నాయన్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో గృహాల్లో వేసుకున్న బోర్లలో నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సర్వే నిర్వహించి హద్దురాళ్లను గుర్తించి ప్రస్తుతం ఉన్న అలుగు ఎత్తును మరో రెండు అడుగుల మేరా పెంచి నిర్మించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో మట్టారెడ్డి, పాపయ్య, సురేష్, వెంకన్న, రవితేజ పాల్గొన్నారు.

అనుమతులు లేని బడులపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్ : అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సమాచార హక్కు సలహా, సహాయ, రక్షణ సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త సరికొండ రుషికేశ్వర్‌రాజు మాట్లాడారు. వినతిపత్రం అందజేసిన వారిలో సామాజిక కార్యకర్తలు కొండలు, మహేష్, సైదానాయక్ పాల్గొన్నారు.

28న డిండి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

డిండి : ఈనెల 28న డిండి ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొంతినేని వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానాకాలం సాగుకు సంబంధించి ప్రాజెక్టు నుండి దిగువకు నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.

చండూరు ఎంపీపీగా అవ్వారి గీత



నూతనంగా ఎంపికైన ఎంపీపీ అవ్వారు గీత, పక్కన జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం

చండూరు : చండూరు ఎంపీపీగా గట్టుప్పల్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు అవ్వారి గీత శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో చండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మొత్తం 10 మంది ఎంపీటీసీలు ఉండగా సమావేశానికి ఐదుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు హాజరయ్యారు. మెజార్టీ సభ్యులు అవ్వారి గీతను ఎంపీపీగా ఎన్నుకున్నారు. మాజీ ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్‌తోపాటు, పెందోట వెంకటమ్మ, ముగ్గురు కాంగ్రెస్ ఎంపీటీసీలు ఎంపీపీ ఎన్నికకు హాజరు కాలేదు. గతంలో ఎంపీపీ ఎన్నిక నిర్వహించిన సమయంలో కోరం లేక వాయిదా పడింది. ఈసారి కోరంతో సంబంధం లేకుండా వచ్చిన మెజార్టీ సభ్యులతోనే ఎంపీపీ ఎన్నిక నిర్వహించినట్లు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఉన్న అవ్వారి గీత పూర్తిస్థాయి ఎంపీపీ బాధ్యతలు చేపట్టారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



జీహెచ్ఎంగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు

కొండమల్లేపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎంగా పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను మంగళవారం హెచ్ఎం ఆర్.నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు మరింత బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేరుపల్లి శ్రీనివాసులు, శ్రీనయ్య, వెంకటేశ్వర్లు, ఎబినైజర్, సూర్య, ఉపాధ్యాయులు కొర్ర లోక్యనాయాక్, జగదీష్, నల్లా నరసింహ, చంద్రయ్య, జనార్ధన్‌రెడ్డి, శ్రీపతిరావు, సైదానాయక్, అశోక్‌రెడ్డి, దేవకుమార్, లక్ష్మయ్య, అజార్ అలీ, అక్కిరెడ్డి, లింగారెడ్డి, కలమ్మ, నాగేంద్రమ్మ, ఉమామహేశ్వరి, మంజుల, సీతారాం, సంపత్‌కుమార్, దయాకర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై విచారణ జరపాలి

నేరేడుచర్ల : నీట్ అవకతవకలపై సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన బృందంతో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి. ధనుంజయ నాయుడు అన్నారు. మంగళవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్షలో అవకతవకలకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకులు కోమ్రరాజు వెంకట్ తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తాం

మిర్యాలగూడ టౌన్ : గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణికుల రద్దీని బట్టి బస్సులు నడిపిస్తామని మిర్యాలగూడ ఆర్టీసీ డిపో మేనేజర్ పాల్ అన్నారు. మంగళవారం ఆయన కార్యాలయంలో డయల్ యువర్ డీఎం'కార్యక్రమాన్ని ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు పలు సమస్యలు డీఎం దృష్టికి తీసుకొచ్చారు. వాటికి డీఎం సమాధానాలు ఇచ్చారు.

లారీ డ్రైవర్ల మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు

హుజూర్‌నగర్ : లారీ డ్రైవర్ల మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీయడంతో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలో జరిగింది. వివరాలు.. హుజూర్‌నగర్ పట్టణ శివారులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్లు కార్తి, అలిగేషన్ లారీలు ఆపి క్యాబిన్‌లో మాట్లాడుకుంటున్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం ముదరడంతో ఘర్షణకు దారి తీసింది. ఇంతలో కార్తి గాయంతో క్యాబిన్‌లో నుంచి బయటకు వచ్చి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ విషయమై ఎస్ఐ ముత్తయ్యను సంప్రదించగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రోడ్లపై పారుతున్న మురుగు



రోడ్డుపై పారుతున్న మురుగు

దేవరకొండ : మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో డ్రైయినేజీ సమస్య ప్రజలను వేధిస్తుంది. ఇళ్లలో నుండి వచ్చే మురుగు నీరు అంతర్గత రోడ్లపై పారుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలోని హనుమాన్‌నగర్‌లోని ఓ కాలనీలో మురుగునీరు అంతర్గత రోడ్డుపై పారుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుందని కాలనీ వాసులు వాపోతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించండి మహాప్రభో...అని మొరపెట్టుకుంటున్నారు.

వైభవంగా ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

రామగిరి(నల్లగొండ): హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ శోభాయాత్ర ర్యాలీ మంగళవారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని రామగిరి రామాలయం నుంచి బస్టాండ్, క్లాక్ టవర్ మీదుగా శివాజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనగణమణ ఉత్సవ సమితి అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శివాజీ ఫౌండేషన్ ౘైర్మన్ చౌహాన్ పాల్గొన్నారు.